క్లుప్తంగా

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



చెత్త సేకరణపై సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ గంగాప్రసాద్

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణ పరిశుభ్రతలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ కోరారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులు, ఇంటింట చెత్త సేకరణ పనులను కమిషనర్ గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్త సేకరణలో ఆటోలు ప్రతిరోజూ ఇంటి నుంచి చెత్త సేకరణ చేయాలని కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు సూచించారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా మీ ఇంటివద్దకు వచ్చే చెత్తసేకరణ వాహనాలకు ఇవ్వాలన్నారు. మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవనం పరిశీలన

సిద్దవటం : మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని గురువారం కాంట్రాక్టుతో కలిసి ఏపీఎంఎస్ఐడీసీ డీఈ నరసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆసుపత్రి భవనం ముందు భాగాన సీసీరోడ్డు, ముఖద్వారం వద్ద ఆర్చీ నిర్మాణ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని వాటిని కూడా పూర్తి చేసి మే నెలలో కొత్త భవనం ఉపయోగంలోకి రానున్నదన్నారు. ఈ ఆసుపత్రి నూతన భవనం నిర్మాణానికి నాబార్డు కింద రూ.6 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. జీఎస్టీ 12 నుంచి 18కి పెంచడంతో నిధులు సరిపోక మొదట అంతస్తులో పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఆయా పనులు పూర్తయ్యేందుకు దాదాపు రూ.1.50 కోట్ల నిధులతో కూడిన అంచనాలను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నామన్నారు.

ఘనంగా ద్రౌపది కల్యాణం

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామం శ్రీ మల్లూరమ్మ ఆలయం వద్ద జరుగుతున్న మహాభారత మహోత్సవంలో భాగంగా గురువారం ద్రౌపది కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ భాగవతారిణి రత్నకుమారి ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయచోటి టౌన్ : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. గురువారం ఆయన కార్యాలయంలో రాయచోటి రూరల్ పరిధిలోని కాటిమాయకుంట బొట్లచెరువుకు చెందిన ఒక బాధితుడికి రూ.లక్ష, అలాగే గాలివీడు మండలం గరగుపల్లెకు చెందిన మరో బాధితుడికి రూ.60 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాటిమాయకుంట వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు రానున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ఓబులవారిపల్లె : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని చిన్నఓరంపాడు క్రాస్ రోడ్డులో శుక్రవారం రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు హాజరవుతారన్నారు.

పక్కా గృహాల పనులను వేగవంతం చేయండి

పెనగలూరు : మండలంలోని జగనన్న కాలనీలలో పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించినప్పటికీ ఇటీవల నిర్మాణ పనులు మందగించాయన్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులను వేగవంతం చేయాలని కోరారు. నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, రోడ్ల సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. బిల్లులు కూడా సకాలంలో లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు. ఎంపీడీఓ వరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శివరుద్ర గౌడ్, ఏఈ రమణ, హౌసింగ్ ఏఈ హరిప్రసాద్‌ల తోపాటు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో ముందస్తుగా అంబేడ్కర్ జయంతి

రాజంపేట : ఏఐటీఎస్‌లో గురువారం భారత రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని ముందుస్తుగా టచ్‌స్టోన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ ది మేకర్ ఆఫ్ మోడర్న్ ఇండియా అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన జానుకళ్యాణి, నందితా, దుర్గాదేవిలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఏఐటీఎస్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, హెచ్ఓడీ బాలనాగేంద్రప్రసాద్, టచ్‌స్టోన్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్‌లున్నారు.

శ్మశానానికి దారేది?



మండల కేంద్రమైన పెనగలూరులోని దళితవాడ ప్రజలకు శ్మశానికి దారిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్వకాలం నుంచి శ్మశానం ఉన్నా అక్కడికి వెళ్లేందుకు దారి సరిగా లేకపోవడంతో ఎవరైనా మరణిస్తే వారు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పొలాల్లో పశువులు రాకుండా కంచె వేసుకున్నారు. శవాన్ని నలుగురు మోయాల్సి ఉండగా, కంచె కారణంగా ఇద్దరే భారం మోయల్సిన దౌర్భాగ్యపు పరిస్థితి నెలకొంది. దీంతో దళితులు పడరాని అగచాట్లు పడుతున్నారు. దళితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలు మార్లు అధికారులకు తెలియజేసిన అధికారులు పట్టించుకోలేదు. తమ బంధువుల చివరి చూపుకు వెళ్లేందుకు కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దారి ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. - పెనగలూరు

వ్యర్థాలు వేసేస్తున్నారు..



మండల కేంద్రంలోని పెద్దచెరువు కట్టపైన ప్రధాన రహదారి వెంబడి వేసిన చెత్తాచెదారం కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేటు నాలుగురోడ్ల కూడలిలో ఉన్న మాంసపు విక్రయ కేంద్రాలు, దుకాణాలు, హోటళ్ల నుంచి వెలువడిన వ్యర్థాలను పెద్దచెరువు కట్ట ప్రధాన రహదారికి ఇరువైపులా వేయడంతో రోడ్డా? డంపింగ్ యార్డా అనే సందేహం కలుగుతోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. వ్యర్థాల నుంచి దుర్వాసన వెదజల్లుతూ అటువైపుగా వెళ్తున్న ప్రయాణీకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోందని ప్రజలు వాపోతున్నారు. దుకాణాదారులకు నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - గాలివీడు

పకడ్బందీగా పది పరీక్షలు

సిద్దవటం : 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి దేవరాజ్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ, బి సెంటర్లలో గురువారం జరుగుతున్న సైన్స్ పరీక్షను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న 10వ తరగతి పరీక్షలు డీఈఓ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పకడ్బందీగా జరుగుతున్నాయన్నారు. గురువారం బద్వేల్ పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రాలు, అట్లూరు, సిద్దవటంలలో 2 కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ సెంటర్‌లో 170 మందికి గాను ఒక విద్యార్థి గైర్హాజరు కాగా, బి సెంటర్‌లో 140 మందికి గాను ఇద్దరు గైర్హాజయ్యారని ఆయన తెలిపారు.



పరీక్షా సెంటర్‌ను తనిఖీ చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు

ప్రజల సుఖసంతోషాలే ధ్యేయం

– గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



చిన్నమండెం: గడప గడపకు కార్యక్రజుమంలో సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : ప్రజల సుఖసంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నమండెం మండలం బోనమల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. బోనమల, కనకంటివారిపల్లె, నాగూరివాండ్లపల్లె, గొల్లపల్లె, హరిజనవాడ, నగిరిలో శ్రీకాంత్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలపై ఆరా తీస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలనడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందడం లేదని దృష్టికి తీసుకువచ్చిన వారి ఎదుటే అధికారుల ద్వారా పరిష్కార మార్గాన్ని చూపిస్తున్నారు. వీధులలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఆయన ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. ఎన్నికలలోనూ, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శంగా సీఎం జగన్ నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అఫ్రోజ్, ఎంపీటీసీ వెంకటప్పనాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, బాబురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఏజాస్‌అలీఖాన్, చుక్క అంజనప్ప, సర్పంచులు జగన్నాథ రెడ్డి, నజీర్ అహమ్మద్, లోకేశ్వర్‌రెడ్డి, దామోదర్, ఎంపీటీసీలు రమేష్, రెడ్డప్ప, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పెద్దప్పనాయుడు, వేణుగోపాల్‌నాయుడు, నాగేంద్రనాయుడు, శేఖర్, మురళి, సీతాపతిరెడ్డి, రమకాంత్‌రెడ్డి, శంకరయ్య, శివారెడ్డి, బుర్హాన్‌ఖాన్, సాదిక్, ఏక, శేషారెడ్డి, వెంకటరెడ్డి, అన్వర్, సజాదు, అబ్రు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇఫ్తార్ పుణ్యకార్యం

ఇఫ్తార్ పుణ్యకార్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోనమలలో సర్పంచ్ కొలిమి అఫ్రోజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పరామర్శ

రామాపురం : మండలంలోని బండపల్లె గ్రామం దిగువ హరిజనవాడకు చెందిన ఒట్టికాళ్ల రెడ్డన్న ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి గురువారం రెడ్డన్న స్వగృహానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీకి రెడ్డన్న చేసిన సేవలను గుర్తుకు చేసుకొని, ఆయన సేవలు మరువలేనివని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరన్న, మాజీ సర్పంచ్ మనోజ్, భరత్, రామ్మోహన్, అంజి, నాగలేసు, నాగరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించండి

లక్కిరెడ్డిపల్లె : విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్యను, పౌష్టికాహారాన్ని అందించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ పరిధిలోని ఖాళీలుగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలలో ఎంపికైన పది మంది అభ్యర్థులకు గురువారం ఉద్యోగ నియామక పత్రాలను అధికారులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. లక్కిరెడ్డిపల్లె క్లస్టర్ పరిధిలో వర్కర్లు 5, హెల్పర్లు 5 పోస్టులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

చిన్నమండెం : నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం చిన్నమండెం మండలం బోనమలలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి తాగునీటి సమస్యలపైన, పనులలో వేగం పెంచడంపై మండలాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. రక్షిత మంచినీటి పథకాలకు డిమాండ్ నోటీసు రూ.2.20 కోట్ల నిధులు కట్టకుండానే 74 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించామని, ఆ ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన బిగించాలని ఆయన సూచించారు. నియోజకవర్గానికి తాగునీటి వసతుల కోసం జేజేఎం నిధుల కింద మంజూరైన రూ.147 కోట్ల పనులలో వేగం పెంచాలన్నారు. నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో జేజేఎం నిధుల కింద మంజూరైన రూ.22 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. తాగునీటి బోర్ల మరమ్మతులు, ఇతర తాగునీటి వసతుల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన కలెక్టర్ ప్రత్యేక నిధులను మంజూరు చేయిస్తామన్నారు. అధికారులు ప్రత్యేక కృషి, శ్రద్ధతో ఎక్కడా తాగునీటి సమస్యలు కనపడకూడదు.. వినపడకూడదని శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ రాయచోటి డీఈ శ్రీనివాసులరెడ్డి, లక్కిరెడ్డిపల్లె డీఈ శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఓ మల్‌రెడ్డి, బోనమల సర్పంచ్ అఫ్రోజ్, ఎంపీటీసీ వెంకటప్పనాయుడు, అన్ని మండలాల ఏఈలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయండి



జగనన్న కాలనీలను నిర్మాణాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాజంపేట రూరల్ : జగనన్న కాలనీలలో లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రోత్సహించాలని సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మిట్టమీదపల్లి జగనన్న కాలనీలను గురువారం సబ్ కలెక్టర్ అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ ఉన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. గృహ నిర్మాణాలు మొదలుపెట్టని వాటిని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా బేస్‌మట్టం వేసి నిలిపివేసిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గోడలు కట్టి స్లాబ్ వేయకుండా మిగిలిపోయిన వాటిని స్లాబులు వేసే విధంగా చూడాలన్నారు. సబ్ కలెక్టర్ వెంట హౌసింగ్ డీఈ మురళీకృష్ణ, కమిషనర్ ఎం.జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యం రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో విద్యా కానుక పంపిణీ

రామాపురం : జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లును సకాలంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా జేవీకే – 4 స్పెషల్ ఆఫీసర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాలో నాలుగో సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యాకానుకలోని వస్తువులను నిల్వ చేసే మండల ఆదర్శ పాఠశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతులను, గదులను ఆయన పరిశీలించారు. భద్రపరిచిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు అందించారు. మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లను సకాలంలో పంపిణీ చేస్తామన్నారు. వీటి పంపిణీ చేయడంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మండల స్థాయిలో రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఈ కిట్లను సకాలంలో సక్రమంగా అందజేసేందుకు ముందుస్తుగా ప్రణాళికబద్ధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంఈఓ రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ పాఠశాలలోని వసతులను తెలుసుకుంటున్న జేవీకే ప్రత్యేకాధికారి వెంకటకృష్ణారెడ్డి

సంబేపల్లెలో..

సంబేపల్లె : జగనన్న విద్యాకానుక కిట్లను సకాలంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా జేవీకే – 4 స్పెషల్ అధికారి వెంకటక్రిష్టారెడ్డి తెలిపారు. జిల్లాలో నాలుగో సంవత్సరం జగనన్న విద్యాకానుక కిట్లను నిల్వచేసే మండల కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో వీరబల్లి, గాలివీడు, రామాపురం, కలకడ, పీలేరు, కేవీపల్లె, మండల కేంద్రాలలో నిల్వ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నందలూరు(రాజంపేట) : నందలూరు బస్టాండు(అంబేడ్కర్‌సర్కిల్) వద్ద ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అన్ని మండలాలకు చెందిన దళిత ముఖ్యనేతలకు తమ పార్టీ నాయకుల ద్వారా ఆహ్వానించామన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ఇప్పటికి సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనారాయణ, దళిత నాయకులు పెనుబాల నాగసుబ్బయ్య, అర్మగం విశ్వనాథ్, కాకిచంద్ర, ఎంపీటీసీ సోమిశెట్టి సునీతాప్రభాకర్, కో– ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల నాని, ఆకేపాటి రమేష్‌రెడ్డి, మట్టిబాబు, టంగటూరు మైనార్టీ నేత షావలి పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ నేడు

కడప– రేణిగుంట నేషనల్ హైవేలోని నందలూరులో ప్రయాణీకులకు ఎదురుచూస్తున్న దశాబ్దాల సమస్యలకు నేడు పరిష్కారం లభించింది. ఈమేరకు గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో సులభ్ క్లాంపెక్స్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు.

భూములివ్వాలంటూ వినతి

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లి పంచాయతీ కొర్లకుంట క్రాస్ రోడ్డులోని ఎస్టీ కాలనీ ప్రజలు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, తహసీల్దార్ పీర్ మున్నీలకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసైన్మెంట్ కమిటీలో భూములివ్వాలని ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు కొర్లకుంట క్రాస్ రోడ్డులో 80 కుటుంబాలు నివసిస్తున్నామని, అందులో ఎస్టీలు, ఇతర కులాలకు చెందిన వారూ ఉన్నారన్నారు. తమకు సెంటు భూమి లేదని, దయచేసి తమకు వ్యవసాయ భూములు ఇప్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లి పేదలందరికీ భూములు అందేలా కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ పీర్ మున్నీ మాట్లాడుతూ అసైన్మెంట్ కమిటీ కోసం దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకుంటూ ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మారే సుకుమార్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ నిధులు కేటాయించలేదు

– బస్‌షెల్టర్ నిర్మాణ ఆరోపణలపై ఏపీఎండీసీ సీపీఓ వెంకటరమణ వివరణ



వెంకటరమణ, ఏపీఎండీసీ సీపీఓ

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె : రైల్వేకోడూరులో నిర్మించిన బస్‌షెల్టర్‌కు ఏపీఎండీసీ ఎటువంటి నిధులు కేటాయించలేదని ఏపీఎండీసీ సీపీవో వెంకటరమణ తెలిపారు. కొన్ని రోజుల క్రితం జనసేనకు తాతంశెట్టి నాగేంద్ర అనే వ్యక్తి వైస్ ఎంపీపీ సొంత నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఏపీఎండీసీ నిధులతో నిర్మించినట్లు ఆరోపణలు చేశారు. ఈ విషయమై గురువారం ఏపీఎండీసీ సీపీఓ వెంకటరమణ విలేకర్లతో మాట్లాడారు. టోల్‌గేట్ వద్ద వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి నిర్మించిన బస్‌షెల్టర్‌కు ఏపీఎండీసీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. అలాగే తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని హెచ్చరించారు. ఏపీఎండీసీ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. అలాగే ఏపీఎండీసీ వారు రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పాఠశాల, వైద్యశాలల నిమిత్తం ప్రతి ఏటా రూ.5.30 కోట్లు తమ సంస్థ నుంచి ఖర్చు చేస్తున్నామన్నారు. రైల్వేకోడూరులోని ప్రభుత్వ వైద్యశాలకు 90లక్షల రుపాయల నిధులతో ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ నిర్మించామన్నారు. రైల్వేకోడూరులో పార్క్, ఇతర ప్రదేశాల సుందరీకరణకు రూ.38లక్షలు మంజూరు చేశామన్నారు. అనంతరాజుపేట పంచాయతీలోని రామయ్యపాళెం ఎస్టీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ మరమ్మతుకు 10లక్షల రుపాయలు విడుదల చేశామన్నారు. అలాగే కోడూరులో 11 ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌లు 55లక్షల రుపాయల నిధులతో నిర్మించామన్నారు. ఏపీఎండీసీ వైద్యశాలకు వచ్చే రోగులకు ఉచిత మందులు సరఫరా చేస్తున్నామన్నారు. ఇప్పుడు ఉన్న పది పడకల ఆసుపత్రిలో ఒక ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

జాబ్ మేళాను జయప్రదం చేయండి

ఓబులవారిపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసుల సహకారంతో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్ మేళా విషయమై ఎంపీడీఓ విజయారావు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలను ఎంపీడీఓ విజయారావు, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డిలు అందజేశారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు సహకరించండి



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డాక్టర్ దివ్యరాణి

రాయచోటి టౌన్ : కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరి సహకారం, తోడ్పాటు అవసరమని యండపల్లె పీహెచ్‌సీ డాక్టర్ దివ్యరాణి సిబ్బందికి సూచించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు రాష్ట్రాన్ని కుష్టువ్యాధి రహిత రాష్ట్రంగా చేయడానికి అందరం నడుం బిగిద్దామని చెప్పారు. ఈ వ్యాధి ప్రాథమిక దశలో గుర్తించి నిర్ధారించుకున్న తరువాత వ్యాధిగ్రస్తులకు యండీటీ మందుల ద్వారా నివారించవచ్చని చెప్పారు. ప్రాథమిక దశలో ఈ వ్యాధిని గుర్తిస్తే వారికి అంగవైకల్యం రాకుండా కాపాడటమే కాకుండా ఆరోగ్యకరంగా ఉండే విధంగా తయారు చేయవచ్చని చెప్పారు. ఆరోగ్య కేంద్రంలోని వైద్య ఆరోగ్య సిబ్బంది కుష్టు వ్యాధిగ్రస్తుడుని గుర్తించాలని హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ సత్యనారాయణ వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు శ్యామల, స్టాఫ్ నర్సులు దేవగణేష్, ఖాదర్‌వలి, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పంచాయతీ పన్నుల వసూలు

చిన్నమండెం : మండల పరిధిలోని టి.చాకిబండ గ్రామంలో అనధికారంగా పన్నుల పేరిట ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆ గ్రామస్తులు ఎంపీడీఓకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమర్ అనే వ్యక్తి అనధికారంగా ఇంటి పన్ను, నీటి పన్ను, చెత్త పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై రసీదులు కోరగా వారి నుంచి సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. పైగా మాపైన కేసులు పెట్టి, పథకాలు తీసేస్తామని, పింఛన్లు ఆపేస్తామని భయపెడుతున్నారని ఎంపీడీఓ తెలియజేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని చాకిబండ గ్రామస్తులు ఎంపీడీఓను కోరారు. స్పందించిన ఎంపీడీఓ విచారణ చేసి గ్రామస్తులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే జగనన్న ఆశయం



రాజంపేట టౌన్: మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అందజేస్తున్న పోలా శ్రీనివాసులరెడ్డి



రైల్వేకోడూరు: సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రాజంపేట టౌన్ : రాష్ట్రంలోని పేదల జీవితాల్లో వెలుగు నింపాలన్నదే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బోయపాళెం– 2లో గురువారం పోలా ఆధ్వర్యంలో ముమ్మరంగా ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇంటింటికి వెళ్లి జగన్ ప్రభుత్వంలో చేకూరుతున్న లబ్ధిని ప్రజలకు తెలియజేశారు. అలాగే గత ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఈశ్వరయ్య, సచివాలయం కన్వీనర్ గోవిందు బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం నాయకుడు పోలా సాయివైభవ్‌రెడ్డి, నాగరాజు, నరసింహా, చిట్వేలి జ్యోతికృష్ణ, పెంచలయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం పరిధిలో తువ్వపల్లి, దూదేకులపల్లెలో మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగబసిరెడ్డి, రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, యోగాంజనేయరెడ్డి, చిన్నబాష, దర్బార్‌వలి, కమాల్, రామచంద్ర రెడ్డి, రమణరెడ్డి, నాగిరెడ్డి, నాగరాజా, వెంకటశివ, సురేంద్ర, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు గడప గడపకు వెళ్లి జగనన్న పోస్టర్లను ఇంటికి అతికించి, జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను అవి ప్రజలకు చేరిన విధానాన్ని క్లుప్తంగా వివరించారు.

సరస్వతిపల్లెలో..

మండలంలోని సరస్వతిపల్లెలో జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సర్పంచ్ మునీర్‌బాషా, వైఎస్సార్‌సీపీ స్టేట్ యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రమణల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, కేశవులు, దొరనాయుడు, కదిరప్పనాయుడు, కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కెసీ అగ్రహారంలో..

రైల్వేకోడూరు : మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలోని కెసి అగ్రహారంలో గురువారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయా అని తెలుసుకుని జగనన్న పోస్టర్లను గోడలకు అతికించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, పద్మనాభరెడ్డి, తిరుమలరెడ్డి, గంగారెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దొంతిరెడ్డి రాజారెడ్డి, రమణారెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, సిద్దారెడ్డి, శ్రీదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో

లక్కిరెడ్డిపల్లె : ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని కో– ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, ఎంపీటీసీలు దస్తగిరి, లక్ష్మినారాయణ, ఉపసర్పంచ్ రాజారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని లక్కిరెడ్డిపల్లె, అనంతపురం ఈడిగపల్లె, కోనంపేట గ్రామాలలో జగనన్నే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల అమలుపై ఆరా తీశారు. గత టీడీపీ ప్రభుత్వ పాలన గురించి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చాన్ బాషా, రవి ఆచారి, కాజా, రవి, రెడ్డయ్య, ఆనంద్, గణపతి, పురుషోత్తం, నరసింహారెడ్డి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.